క్లుప్తంగా

127 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: మనం మన ఈదుమూడి సేవా సంస్థ ఆధ్వర్యంలో నెలనెలా నిర్వహించే ఆరోగ్య సిరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం 127 మందికి వైద్య పరీక్షలు చేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు కావూరి వాసు, డాక్టర్ చంద్రమౌళి, నాగరాజు, శ్యామ్, చిరంజీవి, సైదా సంస్థ సభ్యులు ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కరవదిలో వైద్యుల ఆందోళన


మానవహారం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, జూనియర్ కాలేజీ విద్యార్థినులు

ఒంగోలు రూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనకు నిరసనగా మండలంలోని కరవది గ్రామంలో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వైద్యరంగంలో నైపుణ్యం సాధిస్తున్న మహిళా డాక్టర్ నిండు జీవితాన్ని కొందరు పైశాచిక ఆనందం కోసం చిదిమేయడం అమానుషమని కరవది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ వాణి అన్నారు. స్టడీ అవర్స్‌కు వచ్చిన స్థానిక జూనియర్ కాలేజీ బాలికలతో కలిసి గ్రామంలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనలో నిందితులకు తక్షణమే శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. గ్రామ వీధుల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది కృష్ణారెడ్డి, మాధవి, శ్రీధర్, భార్గవ్, మహేందర్, జ్యోతి, భానుమతి, విక్టోరియా పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేయని టీవీలు


మరుగుదొడ్లకు వెళ్లనీయకుండా అడ్డంగా వేసిన ఫెన్సింగ్


దాదాపు రెండేళ్లుగా ఖాళీగా ఉన్న సూపర్ మార్కెట్

ఆదాయం నిల్.. అసౌకర్యం ఫుల్..!

- ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం
- ఆదాయ మార్గాలను వదిలేసిన ఆర్టీసీ అధికారులు
- ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలోనూ విఫలం
- జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దుస్థితిపై తీవ్ర విమర్శలు

ఒంగోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అస్తవ్యస్తంగా తయారైంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పర్యవేక్షణ కరువై అనేక వ్యవస్థల్లో కనిపిస్తున్న లోపాలు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌ను కూడా వదల్లేదు. దానికితోడు ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఆర్టీసీ ఆదాయ మార్గాల గురించి సంబంధిత అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఈ నిర్లక్ష్యం కాస్తా ప్రస్తుతం ప్రయాణికులకు అసౌకర్యం కల్పించే స్థాయికి చేరింది. గతంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన అనేక సౌకర్యాలు ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోయాయి.

టీవీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ఐక్లిక్ పాయింట్.. అన్నీ నిరుపయోగమే..!

ప్రభుత్వంలో విలీనం కాకముందు ఆదాయ మార్గాల కోసం ఆర్టీసీ అధికారులు వెంపర్లాడేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి ఎంతో మేలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పనితీరు మళ్లీ



మూసివేసి ఉన్న దుకాణం ఎదురుగా పడేసి ఉన్న సామగ్రి


ఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఏడాదికిపైగా ఖాళీగా ఉన్న క్యాంటీన్ స్థలం

మొదటికొచ్చింది. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న పరిస్థితులను గమనిస్తే అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. బస్టాండ్‌లో ఫ్యాన్లు, టీవీలు పనిచేయవు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఉక్కపోతతో కాలక్షేపం చేయక తప్పదు. గతంలో భారీ స్క్రీన్ ఉండేది. సదరు కాంట్రాక్టర్‌కి కాంట్రాక్ట్ రద్దయి నిలిచిపోయినప్పటికీ.. దాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనే ఆర్టీసీ అధికారులకు లేకుండా పోయింది. అదేవిధంగా గతంలో ఐక్లిక్ పాయింట్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయలేనివారు ఐక్లిక్ పాయింట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించారు. అప్పట్లో ఆంధ్రాబ్యాంకు సౌజన్యంతో పోలీసుశాఖ దీనిని ఏర్పాటు చేసింది. తొలినాళ్లలో కొద్దిగా దీనిపై దృష్టి పెట్టినా.. ప్రస్తుతం దాని గురించే పట్టించుకునే వారు లేకపోగా, అందులోని సామగ్రి కూడా లేకుండా పోయింది. కేవలం క్యాబిన్ మాత్రమే కనిపిస్తోంది. ఐక్లిక్ పక్కనే మరో క్యాబిన్ ఏర్పాటు చేశారు. పసిబిడ్డలకు తల్లులు పాలిచ్చేందుకు దీన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. ఆ గదికి నిత్యం తాళం వేసే ఉంటుంది. ఆ తాళం ఎవరి దగ్గర ఉంటుందో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. తాళం గురించి ఆరా తీసేందుకు.. అసలు అలాంటి సౌకర్యం ఒకటుందనే విషయం కూడా ఎవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. బస్టాండు ప్లాట్‌ఫాంపైనే ఎత్తుబల్లలు, అట్టపెట్టెలు ఇష్టారీతిన పేరుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

షాపులు, స్థలాలు ఖాళీ.. ఆదాయానికి గండి...

బస్టాండులోని ఆర్టీసీ ఆర్ఎం గేటు ఎదురుగా గతంలో రెండు షాపులుండేవి. ఒకదానికి ఇన్‌గేటు నుంచి మార్గం. ఈ టిఫిన్ దుకాణం టెండర్ పాడుకున్న వారికి అధికారులు చుక్కలు చూపించారు. కనీసం మురుగునీరు పోయే మార్గం లేక ఆ వ్యాపారి లబోదిబోమన్నా పట్టించుకోలేదు. ఉంటే ఉండు.. లేకుంటే వెళ్లిపో అన్నట్టుగా వ్యవహరించారు. దీని పక్కనే ఉండే మరో హోటల్ అద్దె ద్వారా నెలకు దాదాపు రూ.2.30 లక్షల ఆదాయం వచ్చేది. కానీ, దాని సమీపంలోనే మరో ఫుడ్ షాపునకు టెండర్ ఖరారు చేయడంతో హోటల్ నడుపుతున్న వ్యాపారి ఆందోళన వ్యక్తం చేసినా అధికారులకు పట్టలేదు. చివరకు ఇలాగైతే తాను వ్యాపారం చేయలేనని, తన అడ్వాన్స్ తనకు ఇవ్వాలని కోరాడు. అక్కడ నిర్మించిన షెడ్డు తొలగిస్తేనే ఇస్తామంటూ అధికారులు ఆంక్షలు పెట్టారు. తాను టెండర్ పాడుకున్న వ్యక్తి వద్ద నుంచి ఎంతో కొంత మొత్తానికి అమ్ముకుంటానన్నా.. అధికారులు ససేమిరా అనడంతో చేసేదిలేక తుక్కు కింద దానిని తొలగించి వ్యాపారం విరమించుకున్నాడు. ఈ షాపు దాదాపు ఏడాదికి పైనుంచి ఖాళీగా ఉంది. ఫలితంగా సుమారు రూ.25 లక్షల ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోయింది. దీనికి ఎదురుగా ఆర్ఎం ఆఫీసుకు దిగువ భాగంలో సూపర్ మార్కెట్ ఉండేది. అసలే అది అంతంత మాత్రంగా సాగుతుంటే.. ఆటోలు, బండ్లు లోపలకు రావడానికి వీల్లేదంటూ అధికారులు గేట్లు పెట్టి మరీ తాళాలు వేయడం ప్రారంభించారు. తమది స్టోర్ అని, అందులో కొనుగోలు చేసిన వస్తువులను బండ్ల మీద కాకుండా ఎలా తీసుకెళ్తారని ఆ వ్యాపారి మొత్తుకున్నా ఆర్టీసీ అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించలేదు. దీంతో వారు కూడా చేతులెత్తేసి నష్టాలకు గురై ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆదాయం కోసం మళ్లీ టెండర్లయితే వేస్తున్నారుగానీ.. వ్యాపారుల గోడు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్లాట్‌ఫాంల వద్ద షాపులను కూడా రాత్రి 11 గంటలకల్లా మూసివేయాలంటూ కొంతమంది పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. దీనిపై కూడా ఆర్టీసీ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీ షాపుల్లో వ్యాపారాలు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా అడుగు ముందుకేసే ధైర్యం చేయలేకపోతున్నారు. ఒకవైపు ఆదాయం కోల్పోయి.. మరో వైపు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రయాణికులు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు.



పనిచేయని ఐ క్లిక్ సెంటర్



తలుపులు తెరుచుకోని బ్రెస్ట్ ఫీడింగ్ గది

మహిళల రక్షణలో పాలకులు విఫలం

- జూడాలకు మద్దతు పలికిన ప్రజాతంత్ర మహిళా సంఘం

ఒంగోలు టౌన్: దేశంలోని మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, కోల్‌కతాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన హత్యాచారం దీనికి ప్రత్యక్ష నిదర్శనమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. ఆదివారం జీజీహెచ్ ఆవరణలో జరుగుతున్న నిరసన దీక్షలో పాల్గొన్న ఆమె జూనియర్ డాక్టర్ల పోరాటానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశంలో ఎక్కడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, గుడిలో, బడిలో, వైద్యశాలలోనూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులపై కూడా కీచకులు లైంగికదాడులు చేస్తున్నారని, ముమ్మాటికీ ఇది పాలకుల వైఫల్యమే అని స్పష్టం చేశారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం, ఆ తరువాత ఊరుకోవడం మామూలైపోయిందని, కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు, పోర్న్ వీడియోల ప్రభావం వల్లనే ఇలాంటి దురాగతాలు జరుగుతున్నాయని నిర్భయ ఘటనను విచారించిన వర్మ కమిషన్ తెలిపిందన్నారు. వీటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. నిందితులకు శిక్షలు వేయడంలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలన్నారు. బెంగాల్ ప్రభుత్వం దోషులకు అండగా నిలబడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి గంగవరపు ఆదిలక్ష్మి, నగర నాయకురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.


జూనియర్ డాక్టర్ల నిరసన శిబిరం వద్ద ప్రసంగిస్తున్న వినోద్

కోల్‌కతా ఘటనపై కేంద్రం స్పందించాలి:

కోల్‌కతా ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యపై ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ అన్నారు. జీజీహెచ్ ఆవరణలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న పోరాటానికి ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వ వైద్యశాలలో సీసీ కెమెరాలు లేకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. లైంగిక దాడి హత్య చేసిన దుండగులు ఎలాంటి భయం లేకుండా అదే ఆస్పత్రిపై దాడి చేసి సాక్ష్యాధారాలను లేకుండా చేసేందుకు ప్రయత్నించడం వెనక బలమైన శక్తులు ఉన్నాయన్న సందేహాలు కలుగుతున్నాయన్నారు. వైద్య విద్యార్థుల పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బండి వీరాస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యాచారంపై కవయిత్రుల ఆగ్రహం

ఒంగోలు మెట్రో: ''మేము ఆట వస్తువులం కాదు, మేమూ మనుషులమే. మాకూ హక్కులున్నాయ్'' అంటూ నినదించారు నగరానికి చెందిన కవయిత్రులు. కోల్‌కత్తా కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సామూహిక లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం కార్యాలయంలో ఆదివారం కవయిత్రుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి జరిగిన తీరు, అనంతర పరిణామాలపై కవయిత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్యశాలలో కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు, మహిళా వైద్యుల రక్షణకు ప్రభుత్వం కఠిన చట్టం తీసుకొనిరావాలని డిమాండ్ చేశారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో ప్రరవే అధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి, సింహాద్రి జ్యోతిర్మయి, డా.మున్నంగి రాజకుమారి, ఝాన్సీ దుర్గ, బీరం అరుణ, పరాంకుశం కృష్ణవేణి, మారేపల్లి సూర్యకుమారి కవిత్వాలను వినిపించారు. జూనియర్ మృతిపట్ల శ్రద్ధాంజలి ఘటించారు.

బసవన్నపాలెంలో నీటి కష్టాలు


ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు


రిక్షాడ్రమ్ముతో నీరు తెచ్చుకుంటున్న యువకులు

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం హరిజనవాడలో వాడుకునేందుకు నీరు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలలుగా 200 లీటర్ల డ్రమ్మును రూ.150 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. బసవన్నపాలెం ఎస్సీకాలనీలో చివర ఉన్న నాలుగు బజార్ల వారికి నీరు అందడం లేదు. దీంతో వాడుక నీటిని కూడా కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి నీరు వదిలే సమయానికి మోటార్ల వాడకం పెరిగిపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఎక్కడైనా మంచినీరు కొనుగోలు చేస్తారుగానీ.. తమ కాలనీలో వాడుక నీటిని కూడా కొనుగోలు చేయాల్సి వస్తోందని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ గోడు పట్టించుకుని నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ


మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాధవరావు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని చర్చిలో పేద మహిళలకు ఆదివారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆర్థిక సహకారంతో మాధవరావు తల్లి రాజమ్మ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. తన తల్లి వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పేద మహిళలకు సేవ చేస్తున్నట్లు మాధవరావు తెలిపారు.

శ్రీగిరి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

- నేడు విశేష స్నపన తిరుమంజనం


శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలూరు హిమబిందు, లక్ష్మీకుమారి

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి నుంచి వచ్చిన టీటీడీ ఆగమశాస్త్ర పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీవారికి సహస్ర నామార్చన పంచాంగ పఠనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యక్షంగా వీక్షించి పులకితలయ్యారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఆలూరు కుమార ఆత్రేయ హిమబిందు, ఆలూరు లక్ష్మీకుమారి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పవిత్ర ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు విశేష స్నపన తిరుమంజనం, శ్రీవారికి పవిత్రాల సమర్పణ, సాయంత్రం హోమ కార్యక్రమాలు, రాత్రి తొమ్మిది గంటలకు శ్రీవారికి ఏకాంత సేవ జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

అసోసియేషన్ తీర్మానాలు పాటించండి


ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడుతున్న గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య

చీమకుర్తి: గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ తీసుకున్న నిర్ణయాలను ఫ్యాక్టరీల యజమానులు పాటించాలని అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య అన్నారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి చీమకుర్తి పరిధిలోని ఫ్యాక్టరీలను ఆదివారం సందర్శించారు. ఫ్యాక్టరీలలో గ్రానైట్ ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే ఉత్పత్తి తగ్గించుకునేందుకు ఆదివారం ఫ్యాక్టరీలు నడపడం ఆపాలన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కొంత మంది యజమానులు ఆదివారం కూడా ఫ్యాక్టరీలు నడుపుతున్న సంగతి తెలుసుకుని అసోసియేషన్ సభ్యులతో కలిసి ఫ్యాక్టరీలను సందర్శించినట్లు రమణయ్య తెలిపారు. మార్కెట్‌లో గ్రానైట్ స్లాబ్‌లకు డిమాండ్ పెరగాలంటే వారంలో ఒకరోజు ఫ్యాక్టరీలకు సెలవిచ్చి ఉత్పత్తులు తగ్గించుకునేందుకు ప్రతిఒక్క ఫ్యాక్టరీ యజమాని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నూకల సురేంద్ర, కందిమళ్ల గంగాధర్, ఎస్‌కే అహ్మద్‌బాషా, రామకృష్ణ, గొల్లపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మార్మోగిన జై శ్రీరామ్ నినాదం


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జంట నాగుల విగ్రహాలు

- మద్దిరాలపాడులో భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు: జై శ్రీరామ్ నినాదంతో మండలంలోని మద్దిరాలపాడు గ్రామం ఆదివారం మార్మోగింది. 29 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహంతో పాటు శిఖరం, ధ్వజయంత్రం, సరస్వతి, నాగేంద్రస్వామి, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేద పండితుడు అచ్చితానందశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీరామ కళ్యాణంలో భక్తులు భారీగా పాల్గొని శ్రీరామ నామశ్లోకం జపిస్తూ పులకించిపోయారు. అనంతరం దాతలు స్వామివారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి 5 వేల మంది వరకూ పాల్గొన్నారు. నిర్వాహకులు నెప్పల కృష్ణమూర్తి, గుమ్మడి సురేష్, తాళ్లూరి కృష్ణారావు, నెప్పల శ్రీకాంత్, శ్రీనివాసరావు, అంజిబాబు, నెప్పల నాగభూషణం, పెనుబోతు సునీల్, శివ, చెరుకూరి సుబ్బారాయుడు పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

గ్రాప్లింగ్ జిల్లా స్థాయి క్రీడాజట్టు ఇదే

ఒంగోలు: గ్రాప్లింగ్ జిల్లా స్థాయి క్రీడా జట్టు ఎంపిక ఆదివారం స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఈ పోటీలలో ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాల, నారాయణ ఈఎస్‌జీ ఒంగోలు, సింగరాయకొండ గురుకుల పాఠశాల, దర్శి చైతన్య స్కూల్, టంగుటూరు భాష్యం క్రీడాకారులు సబ్ జూనియర్స్ విభాగాలకు ఎంపికైనట్లు గ్రాప్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సురేష్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీల్లో రేణిగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపిక కమిటీలో పీడీ డి.జ్యోత్స్నాదేవి, కోచ్ వి.జాషువా, జి.ఆనంద్‌బాబు, కార్యదర్శి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.


గ్రాప్లింగ్ అసోసియేషన్ జిల్లా జట్టు